# కంఠుగాడి కాశీయాత్ర

## ఎ.ఎన్. జగన్నాథశర్మ



**KANTHUGAADI KAASIYAATRA**

*by: A.N. Jagannadha Sarma*

---

**కంతుగాడి కాశీయాత్ర**

**ఎ.ఎన్.జగన్నాథశర్మ**

© రచయిత

ప్రథమ ముద్రణ: **జనవరి 2017**

టైటిల్ & లే అవుట్ డిజైన్: **కె. రామకృష్ణ**

ప్రచురణ:

**అమరావతి పబ్లికేషన్స్**
4-21-81, చైతన్యపురి, సాయిబాబా రోడ్
గుంటూరు-522 007 సెల్: 92915 30714

సోల్ డిస్ట్రిబ్యూటర్స్:
**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ**
**నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్**

ప్రతులకు:
**విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచీలు**
తిరుపతి, అనంతపురం, కడప, ఒంగోలు, గుంటూరు,
విజయవాడ, కాకినాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం

**నవచేతన బుక్‌హౌస్ బ్రాంచీలు**
అబిడ్స్, సుల్తాన్‌బజార్, యూసఫ్‌గూడ, కూకట్‌పల్లి, బండ్లగూడ-హైదరాబాద్,
హనుమకొండ, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం

**www.anandbooks.com**

ముద్రణ: **రెయిన్‌బో ప్రింట్‌ప్యాక్,** హైదరాబాద్
మొబైల్: **92462 71620**

వెల: **రూ. 100/-**

# 1

శీతకాలమే కాని, చలిలేని రోజులు. వేసవికాలం కాదుగాని, నీళ్ళు లేని రోజులు. చలి, నీళ్ళతో పాటు ఇంట్లో ఇల్లాలు కూడా లేని రోజు. ఆదివారం అనీ, సెలవు కాబట్టి ఇంట్లో ఉంటాడనీ, ఎంచక్కా వాడితో కబుర్లాడుకుంటాననీ, తమ్ముడింటికి ఇల్లాలుగారు చెక్కేసిన రోజు. కంతుగాడొక్కడూ ఇంట్లో టీవీ చూస్తూ కూర్చున్నాడు. టీవీలో కామెడీ సీన్లు చూస్తున్నాడు. ఏడుపొస్తోంది పాపం! ఏడుస్తూ చల్లారిన ఉప్మాని తింటున్న క్షణాల్లో కాలింగ్ బెల్ మోగింది.

"ఎవరండీ?" లేచి అడిగాడు కంతు.

"ఇంట్లో ఆంటీ లేరాండీ?" నాజూగ్గా అందంగా ఉంది ఓ ఆవిడ. అడిగింది.

"లేరమ్మా"

"ఆంటీతో పని లేదు లెండి." నవ్విందామె.

'మరి నాతో ఉందా?' అడగాలనుకున్నాడు కంతు. అడగలేకపోయాడు. ధైర్యం చాల లేదు.

"నేను మా ఫ్రెండింటికి వెళ్తున్నాను. మా ఇంటి తాళం మీకిస్తాను, మా వారొస్తే, ఆయన కివ్వండి" మూర్ఛరోగి చేతిలో పెట్టినట్టుగా తాళాలు కంతు చేతిలో పెట్టి, తుర్రు మందావిడ. తాళాలు టీపాయ్ మీద గిరాటేసి, మళ్ళీ టీవీ చూడడంలో పడిపోయాడు కంతు. అంతలో ఫోన్ రింగైంది.

"హలో"

"బాబాయ్! నేను మాణిక్యాన్ని."

"ఏంట్రా పొద్దునే ఫోన్ చేశావు?"

"పిన్ని వాళ్ళ తమ్ముడింటికి వెళ్ళిందటగా! సాయంత్రానిగ్గానిరాదని తెలిసింది. ఇద్దరం సరదాగా పార్టీ చేసుకుందామా?"

"పొద్దున పొద్దునే పార్టీ ఏంట్రా? ఉప్మా తింటున్న నోటితో మందు కొట్టలేను."

"నేనొచ్చేసరికి ఉప్మా అరిగిపోతుందిలే! మాంఛి బ్రాందీ ఉంది. పట్టుకొస్తున్నాను" అని కాల్ కట్ చేశాడు మాణిక్యం.

మాణిక్యం, కంతూ ఫ్రెండ్స్. ఇద్దరిదీ ఒకటే వయసు. అయినా కంతుని 'బాబాయ్' అని సంబోధించడం మాణిక్యానికి అలవాటు.

ఉప్మా ఇంకా అరగలేదు. మాణిక్యం ఫుల్ బాటిల్‌తో దిగబడ్డాడు. బాల్కనీలో టీపాయ్, కుర్చీలు సర్ది, మందు ఓపెన్ చేశాడు. కంతు అయిదో సిప్‌లోనో, ఆరో సిప్‌లోనో ఉన్నాడు. మాణిక్యం రెండో పెగ్గు లాగించేశాడు. లాగించేసి అన్నాడిలా.

"అన్నట్టు బాబాయ్! నీకో సంగతి చెప్పడం మరిచిపోయాను."

"ఏంటో అది?"

"నేను ఈ మధ్యనే కాశీ వెళ్ళొచ్చాను బాబాయ్! చూడదగ్గ ప్రదేశం. జీవితంలో ఒక్క సారంటే... ఒక్కసారైనా కాశీ చూడాలి."

"మందు కొడుతూ కాశీ ఊసెత్తడం పాపంరా! వద్దు. ఆ టాపిక్కు ఆపేయ్."

"ఆపను! నువ్వు కాశీ వెళ్ళేవరకూ ఈ టాపిక్ ఆపను. చెప్పింది విను. పిన్నితో వద్దు, ఫ్రెండ్స్‌తో ట్రైన్లో కాశీకి చెక్కేయ్! కాశీతో పాటు గయ, ప్రయాగ, అలహాబాద్, త్రివేణీ సంగమం... అన్నీ చూసేయ్! ఓ పనైపోతుంది."

"నా పనైపోతుంది. అంత సొమ్ము నేనెక్కణ్ణుంచి తేను?"

"బ్యాంకులోంచి తీసుకురా బాబాయ్! దాచావు కదా, ఖర్చు పెట్టు. ఎంజాయ్."

'భళ'మన్నాడు మాణిక్యం. పరగడుపున మందు పడలేదేమో వాంతి చేసుకున్నాడు. రక్షించాడు, బాల్కనీలో కక్కలేదు. పరుగున వెళ్ళి, టాయ్‌లెట్‌లో కక్కాడు. కక్కినంతసేపు పట్టలేదు. మళ్ళీ మందెక్కించడం మొదలెట్టాడు.

"చూడాలి బాబాయ్! నువ్వు శివుణ్ణి చూడాలి. కాశీ విశ్వేశ్వరుణ్ణి చూడని కళ్ళు, కళ్ళు కాదు బాబాయ్! అవి పగిలిన గన్నేరు కాయలు. చిరిగిన చొక్కా జేబులు. నలిగిన వంద రూపాయల నోట్లు."

"నీకు బాగా ఎక్కిందిరా."

"కాశీ నిషా బాగా ఎక్కింది బాబాయ్! నువ్వు కాశీ చూడాల్సిందే, తప్పదు" అన్నాడు మాణిక్యం.

"పదిమంది ఫ్రెండ్స్‌ని పోగెయ్! మహా అయితే ఒకొక్కరికీ పదివేలవుతుంది. వెళ్ళి రండి. మిమ్మల్నక్కడ అల్లుళ్ళకంటే ఎక్కువగా చూసుకునేందుకు మా బ్రదర్ మోహన్ ఉన్నాడు. వాడి ఫోన్ నెంబర్ ఇస్తాను. తీసుకో! రాసుకో!"

"వెళ్ళినప్పుడు చూద్దాంలే."

"నువ్వు వెళ్తున్నావు బాబాయ్! నేను చెప్తున్నానుగా నువ్వు వెళ్తున్నావు. బ్రదర్ మోహన్ నెంబర్ రాసుకో." అన్నాడు మాణిక్యం. మోహన్ మొబైల్ నెంబర్ రాసుకునే వరకూ కంతుని వదల్లేదు.

"నౌ ఐ యాం హేపీ" అని నవ్వాడు మాణిక్యం. కంతు మొదటి పెగ్ పూర్తి కానే లేదు, మరో రెండు పెగ్గులు బిగించి, లంచ్ కోసం, కంతు కోసం వాళ్ళ ఆవిడ చేసిన గుత్తొంకాయకూర తినేసి, ఇంకా రెండు మూడు పెగ్గులు ఉన్న బాటిల్ పట్టుకుని అక్క ణ్ణుంచి వెళ్ళిపోయాడు మాణిక్యం. ఒంటి పెగ్గుతో ఒంటరివాడైపోయాడు కంతు.

ఏ ఇతిహాసం తిరగేసినా, ఏ పురాణం చదివినా, ఏ కావ్యం కళ్ళ ముందు కదలినా కాశీ ప్రస్తావనే! ఆఖరికి జానపదకథల్లో కూడా కాశీరాజులే ఉంటారు. కాశీమజిలీకథలు గురించి చెప్పనక్కరలేదు.

ఇంతగా ప్రసిద్ధి చెందిన కాశీని చూడడంలో తప్పులేదనుకున్నాడు కంఠు.

అప్పుడెప్పుడో ఇంటర్మీడియెట్ క్లాస్‌మేట్సంతా సరదాగా కలవాలనుకున్నారు. కలవాలనుకున్న అందరూ ఏభయ్యోపడిలో పడ్డారు. పడి, ఎంచుకున్న వృత్తుల్లో ఓ స్థాయికి చేరుకున్నారు.

ఇప్పుడు ఆ స్థాయిల్నీ, వయసుల్నీ మరచిపోయి కలవాలనుకోవడమే కాదు, ఓ రెండు మూడు రోజులు ఉంటున్న ఊరికి దూరంగా, కంటున్న మనుషులకు సుదూరంగా వెళ్ళాలనుకున్నారు. అనుకుని, ఆ నిర్వహణంతా కంఠుకి అప్పగించారు.

డబ్బు ఎంతైనా పర్వాలేదు. జబ్బులొస్తాయన్న భయం లేదు. మనలోనే డాక్టర్లు ఉన్నారు. కాబట్టి ఎక్కడకైనా, ఎంత దూరమైనా రైలంటే రైలు, బస్సంటే బస్సులో బయల్దేరదాం. నీ ఇష్టం అన్నారు. కంఠు చేతికి ఇందాక నాజూగ్గా అందంగా ఉన్న ఆవిడ తాళాలు ఇచ్చినట్టుగా భరోసా ఇచ్చారు.

అదిప్పుడు గుర్తొచ్చింది కంఠుకి. ఫ్రెండ్సందరికీ ఫోన్లు చేశాడు. కాశీయాత్ర గురించి చెప్పాడు. వెళ్దామా? అడిగాడు. వెళ్దామంటే వెళ్దామన్నారంతా. చుట్టుపక్కల ఊళ్ళు కూడా చూద్దాం అంటే చూద్దాం అన్నారు. ముందు ఫలానా తేదీకి ట్రైన్‌కి టిక్కెట్లు బుక్ చెయ్ అన్నారు. రానూ పోనూ సెకెండ్‌క్లాస్ ఏసి టిక్కెట్లు తీసుకో అన్నారు.

తీసుకున్నాడు కంఠు.

ఫోన్ చేసి టిక్కెట్లు తీసుకున్న సంగతి చెప్పాడందరికీ. ఫలానా తేదీన సికింద్రాబాద్‌లో కలుసుకుందాం. ఉదయం పదిగంటలకు ట్రయిన్. తొమ్మిదిన్నరకల్లా అంతా స్టేషన్లో ఉండాలన్నాడు. అలాగే అంటే అలాగే అన్నారంతా.

అప్పుడు గుర్తొచ్చింది. ఉదయం గడచి సాయంత్రం అయిందని. అలాగే భార్యామణి వచ్చే వేళయిందనీ. దాంతో వెంటనే స్నానం చేసి, తాను కాశీయాత్రకి బయల్దేరుతున్న సంగతి భార్యకి ఎలా చెప్పడం, చెప్పి ఆమెను ఒప్పించడం ఎలా? అన్నది ఆలోచించాడు కంఠు. ఆలోచించింది ఆచరణలో పెట్టడం ఎలా అన్నది రెండు మూడుసార్లు రిహార్సల్స్ వేసుకున్నాడు. వేసుకుని ఊపిరి పీల్చుకున్నాడు.

కాలింగ్‌బెల్ మోగింది.

ఎవరో యువకుడు. పెద్దగా బాగోలేడు.

"మా మిసెస్ మీకేమైనా ఇచ్చిందా?" అడిగాడు.

"తాళాలు మాత్రమే ఇచ్చింది" చెప్పాడు కంఠు. తాళాలిచ్చాడతనికి.

• • •

కాశీనే 'వారణాసి' అంటారు. వరుణ నది, అసి నదుల సంగమ స్థలాల మధ్య గల ప్రాంతాన్నే వారణాసిగా వ్యవహరిస్తారు. కాశీని 'బెనారస్' అని కూడా అంటారు. ఇది

ఉత్తరప్రదేశ్‌లో గంగానది ఒడ్డున ఉన్నది. దేశానికే ఇది ఆధ్యాత్మిక, సాంస్కృతిక రాజధాని. ఇక్కడే గోస్వామి తులసీదాసు 'రామచరిత మానస్'ను రచించాడు.

కాశీని గురించి ఎప్పుడో ఎక్కడో చదివినవన్నీ ఒకొక్కటీ గుర్తు చేసుకోసాగాడు కంతు. అంతలో తమ్ముడు ఇంటి నుంచి భార్యామణి రానే వచ్చింది.

"ఏంటి కాశీ వెళ్తున్నారా?" అడిగింది.

"ఎవరు చెప్పారు నీకు?"

"ఇంకెవరు మాణిక్యం చెప్పాడు."

"నీతో కాశీకి వెళ్ళొద్దన్నాడు కూడా."

"ఆ సంగతీ చెప్పాడు. నేను మీతో రానుగానీ, మీరెప్పుడు వెళ్ళేదీ, ఎంతమంది వెళ్తున్నదీ చెబితే ట్రైన్‌లోకి ఫుడ్ ప్యాక్ చేసి ఇస్తాను, మూడు పూటలు ప్రయాణం అంటే ఫుడ్ బాగా ఉండాలి" అన్నది భార్య.

కాశీకి వెళ్తున్నానంటే కోప్పడలేదు. తనని తీసుకుని వెళ్ళడం లేదంటే చేయి చేసుకోలేదు. పైగా మూడు పూటలకి సరిపడా మిత్రబృందానికి ఫుడ్ ఏర్పాటు చేస్తానంటోంది భార్య. ఇది కలా? నిజమా? అనుమానం కలిగింది కంతుకి. గట్టిగా తనని తానే గిచ్చుకుని 'అబ్బా' అన్నాడు.

"ఏంటా గిచ్చుకోడం? ఇది నిజమే! కల కాదు. నేను మీతో ఎందుకు రానంటున్నానంటే... మీరొచ్చిన తర్వాత మా తమ్ముడూ, మరదలూ, మా చెల్లెలూ, మరిదీ... మేమంతా వెళ్దామనుకుంటున్నాం. వాళ్ళతో వెళ్తే అన్నీ హాయిగా తీరుబడిగా చూసుకోవచ్చు. మీతో వస్తే ఒకటే గాబరా! చిరాకు. అందుకే రానంటున్నాను" అంది భార్య. అదీ సంగతి అనుకున్నాడు కంతు.

"ట్రైన్‌కి ప్యాంట్రీ ఉంటుంది కదా, నీకెందుకు శ్రమ?" భార్య మీద జాలిపడ్డాడు.

"ఆ ఫుడ్ తింటే అంతేసంగతులు. ఆ మధ్య మా తమ్ముడూ వాళ్ళింటి పక్కవాళ్ళూ ఇలాగే కాశీకి వెళ్ళి, ట్రైన్‌లో ఫుడ్ తిని, ఎక్కడి నీళ్ళు అక్కడ తాగి తిరిగొచ్చారట! వచ్చి, అంతా వారం రోజుల పాటు పడకేశారట!"

"అమ్మో!"

"అందుకే ఫుడ్ ఇస్తానంటున్నాను, మీ మీద ప్రేమ కారిపోయి కాదు."

"భర్త క్షేమం కోరుకుంటున్నావంటే... ప్రేమే కదా?"

"సర్లెండి! వెళ్ళేది ఎప్పుడు?"

ఫలానా తేదీ అంటూ చెప్పాడు కంతు.

ఆ రాత్రి మిత్రుడు బాబు ఫోన్ చేశాడు కంతుకి. అతను కూడా కాశీకి వస్తున్నాడు.

"మనల్ని అల్లుళ్ళలా చూసుకునే కాశీమోహన్‌కి ఫోన్ చేసి మాట్లాడావా?" అడిగాడు.

"లేదింకా".

"మాట్లాడు. మంచి హోటల్ చూడమను. నాలుగైదు రూములు బుక్ చెయ్యమను. రూం రెంట్ రీజనబుల్‌గా ఉండాలని చెప్పు. అలాగే అక్కడి వింతలూ-విశేషాలూ చూపించడానికి ఓ గైడ్‌ని కూడా మాట్లాడి పెట్టమను. ఇంకా..." అని ఏదో బాబు చెప్పబోతుంటే అతన్ని వారిస్తూ అన్నాడిలా కంతు.

"నేనన్నీ మాట్లాడతానుగానీ, ముందు నువ్వు ఓ పని చెయ్యి."

"చెప్పు."

"డాక్టర్‌వి కదా! జలుబుకీ, జ్వరానికీ, ఆకలికీ, అరగడానికీ మందులు పట్టుకో."

"ఓకే."

"గుడ్‌నైట్" మరో మాటకి అవకాశం లేకుండా ఫోన్ పెట్టేశాడు కంతు.

చూస్తూండగానే ఆ ఫలానా తేదీ వచ్చేసింది. మర్నాడు పొద్దున ప్రయాణం అంటే ముందు రోజు రాత్రి బ్యాగు సర్దడంలో పడ్డాడు కంతు. బ్యాగులో అయిదారు డ్రస్‌లు పెట్టుకున్నాడు. బనీన్లూ, లుంగీలు, టవళ్ళూ పెట్టుకున్నాడు. స్వెట్టర్, మఫ్లర్ పెట్టుకున్నాడు. దుప్పటి కూడా పెట్టుకున్నాడు. సైనస్ క్లియర్ చేసుకునేందుకు అలవాటైన 'ఆవిరియంత్రం' పెట్టుకున్నాడు. ఇంకా అది పెట్టుకోవాలి, ఇది పెట్టుకోవాలనుకుంటూనే నిద్రపోయాడు.

అంతలో భళ్ళున తెల్లారింది.

ఉదయం పదిగంటలకు సికింద్రాబాద్‌లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాలి. అంటే తొమ్మిదిన్నరకల్లా స్టేషన్లో ఉండాలి. గబగబా తయారయ్యాడు కంతు. ఆటో పిలుచుకుని వస్తానని వెళ్ళబోతుంటే భార్యామణి వారించింది.

"ఆటో కాదు, చిన్న ట్రాలీని పిలవండి! చేసిన వంటంతా పట్టుకెళ్ళాలిగా" అంది.

ట్రాలీనా? అంటూ అక్కడ వంటల్ని సర్దిపెట్టిన సంచులవైపు చూశాడు కంతు. సిమెంట్ బస్తాల్లా ఆరేడు సంచులు ఉన్నాయి. 'హతోస్మి' అనుకున్నాడు.

## 2

ప్రయాణానికి సూట్‌కేసు సర్దుకుంటూ కంతు నిద్రపోయినప్పుడే వాళ్ళావిడా, ఆవిడ చెల్లెలూ లేచి తెల్లార్లూ ఫుడ్ తయారు చేశారట! అదే ఆరేడు సంచులట! ఆ సంచుల్ని స్టేషన్‌కి తరలించాలిప్పుడు. అందుకు ఆటో లేదంటే ట్రాలీ మాట్లాడేందుకు రోడ్డునపడ్డాడు కంతు. అటు అడిగితే ఇటు అంటాడు ఆటోవాలా. ఇటు అడిగితే అటు అంటాడు.సికింద్రాబాద్ అంటే చార్మినార్, చార్మినార్ అంటే సికింద్రాబాద్ అంటున్నాడు. కిటుకు తెలిసిపోయింది కంతుకి. ఎలా అడిగితే సికింద్రాబాద్‌కి ఆటో దొరుకుతుందో అర్థమైపోయింది. దాంతో ఆటోవాలాని ఆపి 'చార్మినార్' అన్నాడు.

"ఎక్కండి" అన్నాడు ఆటోవాలా.

"ఎక్కడికి?" అడిగాడు కంతు.

"చార్మినార్‌కి."

"కాదు కాదు! సికింద్రాబాద్ వెళ్ళాలి."

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Kanthugadi+Kasiyatra**

* * *